సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిరసన తెలుపుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

ఇచ్చోడ, సెప్టెంబర్ 28 : గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ గిరిజన గురుకుల, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. విద్యా జేఏసీ స్టేరింగ్ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన చాక్ డౌన్, పెన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రోజారాణి, ట్రైటా జాయింట్ సెక్రెటరీ కృష్ణవేణి, అశ్విని, గీతాంజలి, స్వప్న పాల్గొన్నారు.

శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

ఆందోళన చేస్తున్న బంధువులు

భైంసా, సెప్టెంబర్ 28 : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కుభీర్ మండలంలోని రాజురా గ్రామానికి చెందిన గర్భిణీ కొట్టే ఆనంద గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. అదే రోజు డెలివరీ కాగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శనివారం శిశువు మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై కొద్ది సేపు ఆసుపత్రిలో ఆందోళన నెలకొనడంతో పోలీసులు చేరుకుని సముదాయించారు. అనంతరం మృత శిశువును బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యులు అనిల్‌ను సంప్రదించగా.. శిశువుకు పాలు తాపించే క్రమంలో అజాగ్రత్త కారణంగా శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సోలార్ పెన్సింగ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

విద్యతోనే భవిష్యత్

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, సెప్టెంబర్ 28 : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల కె బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ ద్వారా మంజూరైన సోలార్ పెన్సింగ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో కాంపౌండ్ సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా విద్యార్థుల ఇబ్బందులు పడకుండా సోలార్ పెన్సింగ్ ఏర్పాటుకు కృషి చేయడంపై ఎమ్మెల్యే సంతోషించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకులు అభిరెడ్డి, ప్రతాప్‌సింగ్, రాథోడ్ సురేందర్, సాయిరాం, సోమన్న, ఖయ్యూం, హెచ్ఎం అంబారావ్ పాల్గొన్నారు.

శ్రమిస్తే విజయాలు సాధించొచ్చు

నిజామాబాద్ శిక్షణ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : లక్ష్యాలను నిర్దేశించుకుంటూ, దానికి అనుగుణంగా శ్రమిస్తే విజయాలు సాధించొచ్చని ఆల్ ఇండియా ఐఏఎస్ 35వ ర్యాంకర్, నిజామాబాద్ శిక్షణ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ అన్నారు. శనివారం డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన కేరీర్ గైడెన్స్, అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్స్, గ్రూప్స్ ఏ విధంగా సాధించవచ్చో తెలియజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ శిక్షణ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మాట్లాడుతూ.. ఏ రంగంలోనైన రాణించాలంటే వాటి గురించి తెలుసుకుంటు వచ్చిన తరువాత తాము ఏం చేయాలో గుర్తించాలన్నారు. అప్పుడే శ్రమకు తగ్గిన ఫలితం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత, వైస్ ప్రిన్సిపల్ జగ్రామ్ అంతర్వేది, అధ్యాపకులు అరుణ్‌కుమార్, సంతోష్ కుమార్, చక్రవర్తి, రవి కిరణ్, అష్రఫ్ అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిజామాబాద్ శిక్షణ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్

అయ్యా బాంచెన్.. మా గూడు కూల్చొద్దు

అధికారులను వేడుకుంటున్న ఖానాపూర్ ప్రజలు

జిల్లాకేంద్రంలోని చెరువు ప్రాంతంలో ఇండ్లపై ఎర్రగీతలు పెట్టిన అధికారులు

- రెండు రోజులుగా స్థానికుల ఆందోళన.. మార్కింగ్ నిలిపివేత
- ఇతర చెరువుల్లోనూ రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సర్వే
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం
- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ఈ గతిపట్టిందని ఆవేదన

ఖానాపూర్ చెరువు కొలతలకు వచ్చిన సిబ్బంది నిలదీస్తున్న స్థానికులు

ఖానాపూర్ చెరువు సర్వేకు వచ్చిన బృందాన్ని చుట్టుముట్టిన స్థానికులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) మార్కింగ్ స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నది. రెండ్రోజులుగా ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లపై ఎర్రగీతలు పెట్టిన అధికారులు స్థానికుల ఆందోళన ఫలితంగా శనివారం నిలిపివేశారు. జిల్లా కేంద్రానికి అనుకుని పలు చెరువులు ఉండగా.. వాటి పరిసర ప్రాంతాల్లో స్థానికులు నివాసగృహాలను కట్టుకున్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువుల సర్వే చేపట్టారు. ఈ శాఖల అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఖానాపూర్ చెరువు సర్వే నిర్వహించారు. చెరువుల రక్షణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము సర్వే చేసి హద్దులను గుర్తిస్తున్నట్లు అధికారులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చెరువుల సర్వే స్థానికుల్లో భయందోళనకు గురి చేస్తున్నది. పలు చెరువుల్లోని వందల సంఖ్యలో ఇండ్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తమ ఇండ్ల పరిస్థితి ఏమిటని చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

పేదల ఇండ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఖానాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ కోసం వచ్చిన సిబ్బందిని స్థానికులు, మహిళలు అడ్డుకున్నారు. 30 సంవత్సరాల నుంచి తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, గతంలో ఏ ప్రభుత్వం తమ ఇండ్లను కూలగొట్టే ప్రయత్నం చేయలేదని, కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసినందుకు తమకీ గతి పడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల అక్రమణదారులు, బడాబాబులపై చర్యలు తీసుకోవాలి తప్పా కూలీ,నాలీ చేసుకుంటూ పొట్టపోసుకునే తమ గూడును కొల్లగొట్టాల్సిన అవసరం ఏమి వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇండ్లను అధికారులు అన్యాయంగా కూల్చివేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ కాంగ్రెసొస్తే గుండు గీయించుకుంటా..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేసి మోసపోయినం. నాకు నలుగురు కొడుకులు, కోడళ్లు, మనవలు ఉన్నారు. 50 ఏండ్లుగా నేను ఇక్కడ ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నా. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, పేదలు ఇండ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ పత్రం ఇచ్చారు. ఒక్క హామీ అమలు కాకపోగా.. మా ఇండ్లను కూలగొట్టి పేదల బతుకులు ఆగం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో పేదలు బంగారంలా బతికారు. గరీబోళ్లకు ఆపదలో ఆదుకుని అన్నం పెట్టి అండగా ఉన్నాడు. కాంగ్రెస్ పార్టీకి ఇదే చివరి పాలన. పేదల ఇండ్లు కూలగొట్టి మా బతుకులు ఆగం చేస్తున్న కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రాదు. వస్తే నేను గుండు కొట్టించుకుని ఊరంతా తిరుగుతా.

- బొడిగం గంగన్న, ఆదిలాబాద్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ప్రత్యామ్నాయం చూపించిన తరువాతే సర్వే చేయాలి

మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : నీటి వనరుల రక్షణ కోసం చేపడుతున్న సర్వేలో పేద వారు ఇండ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించిన తరువాతనే సర్వే చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖానాపూర్ చెరువు సర్వే, రోడ్లు, మురికి కాలువల వంటి సమస్యలపై లెవనెత్తారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్‌తోపాటు కమిషనర్ ఖమర్ అహ్మద్ హామీ ఇచ్చారు. అనంతరం తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ మాట్లాడుతూ.. నీటి వనరుల రక్షణలో భాగంగా ఖానాపూర్ చెరువు వద్ద చేపడుతున్న సర్వేతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయమైన అన్ని పార్టీల కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి ప్రత్యామ్నాయం చూపిన తరువాతనే సర్వే నిర్వహించాలని కోరుతామన్నారు. అదేవిధంగా పట్టణంలోని సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేశామన్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 28 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సురేశ్ మాట్లాడుతూ.. బాసర ట్రిపుల్ ఐటీలో హౌజ్ కీపింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీరాజి, సాయిలు, భారతి, సాయిబాబా, లింగన్న, సిద్ధు, గంగన్న, ఆకాశ్, సాయి, రవి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు రెడీ

1.46 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

- అక్టోబర్ నెలాఖరు నుంచి ప్రారంభం
- వడ్ల సేకరణకు 228 కేంద్రాల ఏర్పాటు
- గన్నీ బ్యాగులు, టార్పాలిన్లను సిద్ధం చేస్తున్న అధికారులు
- సన్న వడ్ల దిగుబడి 62,370 మెట్రిక్ టన్నులు
- దొడ్డు రకాలు 84,525 మెట్రిక్ టన్నులుగా అంచనా

ఖానాపూర్ మండలం తర్లపాడులో పొట్టదశకు వచ్చిన వరిపంట

కొనుగోళ్ల కోసం సిద్ధంగా ఉంచిన గన్నీ బ్యాగులు

నిర్మల్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 4,33,300 ఎకరాల్లో పత్తి, వరి, మక్క, సోయా, పప్పు దినుసులతోపాటు ఇతర వాణిజ్య పంటలు సాగవుతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందులో వరి 1.35 లక్షలు, పత్తి 1.68 లక్షలు, సోయా ఒక లక్ష, మక్క 18 వేలు, కందులు 10 వేలు, మినుములు, పెసర్లు 1000 ఎకరాల్లో సాగవుతున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా, మరో 20 నుంచి 30 రోజుల్లో కోత దశకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ అధికారులు, మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 228 సెంటర్ల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. వచ్చే నెల చివరి వారంలో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు అక్టోబర్ 20 నుంచి అవసరమైన చోట కేంద్రాలను ఏర్పాటు చేసి, నవంబర్ మొదటి వారంలో పూర్తిస్థాయిలో సెంటర్లను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్‌లో ఎకరాకు 18 క్వింటాళ్ల చొప్పున 2.39 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నుంచి స్థానిక అవసరాలు, సీడ్ కోసం దాదాపు 93 వేల మెట్రిక్ టన్నులు పోగా, మిగతా 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. వీటిలో సన్న రకాలు 62,370 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకాలు 84,525 మెట్రిక్ టన్నులు ఉంటాయని చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 228 కేంద్రాల ఏర్పాటు

నిర్మల్ జిల్లాలో 228 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. వీటిలో ఐకేపీ 54, పీఏసీఎస్ 92, డీసీఎమ్మెస్ 77, జీసీసీ ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. మార్కెటింగ్ శాఖ అధికారులు గత యాసంగి సీజన్‌లోనే కొనుగోలు సెంటర్ల ఏజెన్సీలకు 130 ప్యాడీ క్లీనర్లను అందజేశారు. అదనంగా మరో 95 ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచారు. అలాగే అకాల వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడేందుకు 4,560 టార్పాలిన్లు అవసరం ఉండగా, ప్రస్తుతం 3,411 అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే ధాన్యాన్ని తూకం వేసేందుకు 300 వరకు ఎలక్ట్రానిక్ కాంటాలను సిద్ధంగా ఉంచారు. ప్రతి సెంటర్‌లో క్యాలిఫర్‌ను అందుబాటులో ఉంచి సన్నరకం ధాన్యాన్ని నిర్ధారించనున్నట్లు చెబుతున్నారు. అలాగే ఖానాపూర్, సారంగాపూర్ మార్కెట్ యార్డుల్లో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు డ్రయ్యర్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. దీంతోపాటు తేమ శాతాన్ని గుర్తించేందుకు 250 మీటర్లను అందుబాటులో ఉంచామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

లక్షా 46వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తాం. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోపు వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేశాం.

- ఎల్.కిషోర్ కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్, నిర్మల్

37 లక్షల గన్నీ బ్యాగులు అవసరం

మద్దతు ధర రావాలంటే రైతులు పలు సూచనలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పించనున్నారు. అయితే సన్న రకాలకు గత యాసంగి నుంచే రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. ఈ సారైనా బోనస్ ఇస్తే సన్న రకాలకు రూ.2,820ల ధర దక్కనున్నది. వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కోసం 37 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా, ప్రస్తుతం జిల్లాలో 13.60 లక్షల సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా గన్నీ బ్యాగులను సేకరణ అధికారులకు సవాల్‌గా మారనున్నది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం తరలించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చి విక్రయించిన రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడనున్నారు.

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.ప్రభాకర్ రావు

అందరి సహకారంతో కేసుల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అందరి సహకారంతోనే కేసులను పరిష్కారం చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో జాతీయ లోక్ అదాలత్ ప్రధాన న్యాయమూర్తి టి.ప్రభాకర్‌రావు, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. నేరం పర్యావసానం తెలిస్తే తగ్గు ముఖం పడుతాయన్నారు. దీని కోసం డీఎల్ఎస్ఏ ద్వారా చట్టాలు, శిక్షణలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం రాజీ మార్గం ద్వారా పలు కేసులను పరిష్కరించి రాజీపత్రాలను కక్షిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డాక్టర్ శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

- నిర్మల్ జడ్జి కర్ణకుమార్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 28 : సత్వర కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ కుదుర్చుకున్న కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రాజీ కుదుర్చుకునే కేసులన్నింటినీ లోక్ అదాలత్ ద్వారా సమయం వృథా కాకుండా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

954 కేసులు పరిష్కారం

- రూ.12 లక్షల పైచిలుకు జరిమానా వసూలు : ఎస్పీ గౌష్ ఆలం
- 18 సైబర్ క్రైమ్ కేసులలో బాధితులకు రూ.3.71 లక్షలు తిరిగి అందజేత

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన వచ్చిందని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. 954 కేసులు పరిష్కారం, రూ.12 లక్షల పైచిలుకు జరిమానా వసూలు చేశారన్నారు. అలాగే 18 సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.3.71 లక్షలను తిరిగి అందజేశామని తెలిపారు. 287 ఎఫ్ఐఆర్, 665 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారం అయ్యాయన్నారు. ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్ న్యాయస్థానాల్లో వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న 954 పోలీస్ కేసులు పరిష్కరించబడ్డాయి. 15 రోజుల నుంచి సంబంధిత అధికారులు పోలీసులతో వివిధ సమావేశాలు ఏర్పాటు చేసి విశేష కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు జిల్లా పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ప్రకటించారు. ప్రతి రోజు కేసుల వివరాలను వెల్లడిస్తూ, లోక్ అదాలత్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులను మరింత ఉత్సాహ పరుస్తూ భారీ సంఖ్యలో కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్న డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సైబర్ డీఎస్పీ హసీబుల్లా, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐ ప్రసాద్, ఎస్సై ఎంఏ హకీం, సైబర్ క్రైమ్, డీసీఆర్బీ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు

సర్దుబాటుకు ముందు ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : అసంబద్ధమైన రేషనలైజేషన్ జీవోలను సవరించాలని, సర్దుబాటుకు ముందు ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఏ స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు సురేఖ, కోశాధికారి కిష్టన్న, జిల్లా కార్యదర్శి కార్యదర్శులు కే శ్రీనివాస్, గౌష్ మొహిద్దిన్, గణేశ్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, మండల బాధ్యులు కే సంతోష్, ఓ.అశోక్, కె.గంగాధర్, మహేందర్, గణేశ్, విఠల్, రాజశేఖర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.